క్లుప్తంగా

నేడు తుక్కుగూడలో మంత్రి పర్యటన

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పర్యటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు 12వ వార్డులోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాల్లో అదనపు గదులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, 9, 14 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ వసంత తెలిపారు. 2, 3, 4, 5 వార్డుల పరిధిలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

పీర్ల పండగ ఐక్యమత్యానికి ప్రతీక

మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న నర్సింహారెడ్డి

మహేశ్వరం: పీర్ల పండగ ఐక్యమత్యానికి ప్రతీకలని మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహరెడ్డి పేర్కొన్నారు. నాగారంలో పీర్ల ఊరేగింపులో బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి మైనార్టీ సోదరులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండగను ఐక్యంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. నాగారం మాజీ సర్పంచ్ కావలి దశరథ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, అన్వర్ ఖాన్, మల్లేష్, ఫిరోజ్‌ఖాన్, శకీర్, సాదిక్ పాల్గొన్నారు

ఓపెన్ టెన్త్ తరగతులు ప్రారంభం



తరగతుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ రాంచందర్

మీర్‌పేట: ఉచిత ఓపెన్ టెన్త్ తరగతులను పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ తెలిపారు. ప్రథమ్ సెకండ్ ఛాన్స్ ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని కమ్యూనిటీహాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన తరగతులను రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగానే ప్రథమ్ సంస్థ వారు ఉచిత తరగతులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు గంగమ్మ, శోభ, లావణ్య, ప్రథమ్ సంస్థ ప్రతినిధులు పరిమళ, జ్యోతి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలో మంగళవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దంతోజి నరసింహాచారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోస్తే యువత కోసం చేపట్టనున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుక్క పాండురంగారెడ్డి, బుక్క మహేందర్‌రెడ్డి, తిమ్మగళ్ల మహేందర్, అల్వాల భిక్షపతి, ఆంజనేయులుచారి, ఎండీ యూసుఫ్, పెద్దబాబు, బుక్క శ్రీనివాస్‌రెడ్డి, రేవెల్ల ప్రభుదాస్, అనిల్, రేవెల్లె నరసింహా, బి.మల్లేష్, ఊటు రాజు పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధే ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నానని చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. 3వ వార్డు రాయల్ కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం కౌన్సిలర్ అహ్మద్ కసాదితో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు, డ్రెయిన్ బాక్స్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులతో మున్సిపాలిటీ రూపురేఖలు మారాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.

తస్మాత్ జాగ్రత్త

కొత్త మార్గాలతో సైబర్ మోసం

- అవగాహన తప్పని సరంటున్న నిపుణులు

అమాయక ప్రజల అవసరాన్ని ముందుగానే అంచనా వేస్తున్నారు. మోసాల్లో కొత్త పుంతలు తొక్కుతున్నారు. బ్యాంకు రుణం మంజూరైందని, క్రెడిట్ కార్డు రెన్యూవల్ పేరిట, కొందరికి సిమ్‌కార్డు అప్‌డేట్ చేయాలని, బహుమతులు గెల్చుకున్నారని, ఇంటి నిర్మాణానికి మెటీరియల్ సప్లైయ్ చేస్తామంటూ కొత్త తరహాలో వ్యక్తులకు ఆశ చూపుతున్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు తెలుసుకొని సైబర్ నేరగాళ్లు పెద్ద మొత్తాల్లో దోచుకుంటున్నారు.



కందుకూరు: రోజురోజుకి సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈజీ మనీ ధ్యేయంగా డబ్బు సంపాదించడమే లక్ష్యంగా నమ్మించి బురిడీ కొట్టిస్తున్నారు. లక్షల్లో డబ్బు స్వాహా చేస్తున్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పాలని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని మాటల్లోదించి డబ్బు కొల్లగొడుతున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులని లేదా లోన్ మంజూరైందని చెప్పి పిన్, బ్యాంక్ ఖాతా వివరాలు తెలుసుకుని ఖాతాలో ఉన్న సొమ్ము స్వాహా చేస్తున్నారు. తాజాగా ఇలాంటి మోసాలను ఎక్కువగా మధ్యతరగతి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులనే ఎంచుకొని దోచుకుంటున్నారు. ముందుగా పెట్రోల్ పంపులు, రోడ్లపై నిలిపి ఉంచే ట్రాన్స్‌పోర్టు లారీ యజమానుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. మరోప్రక్క ఇళ్లు నిర్మించుకుంటున్న యజమానుల వివరాలు తెలుసుకుంటున్నారు. వాళ్లతో తెలిసిన వ్యక్తిలా ఫోన్‌లో మాట్లాడి తను మెటీరియల్ సప్‌లైయర్ అని చెప్పుకుంటున్నారు. ఇసుక, డస్ట్, కంకర వంటి వాటిని తక్కువ ధరకే సరఫరా చేస్తామని నమ్మబలుకుతున్నారు. మార్కెట్ ధర కంటే కొంత మేర తక్కువగా లభిస్తుండటంతో వారు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. మెటీరియల్ పంపించిన వెంటనే నగదు ఆన్‌లైన్ ద్వారా పంపించాలని ముందుగా షరతు విధిస్తున్నారు. మెటీరియల్ వచ్చిన తర్వాతనే నగదు పంపాల్సి ఉండటంతో ఇటు నిర్మాణదారులు ఒప్పుకుంటున్నారు. మరోవైపు ఆ మోసగాళ్లు లారీల యజమానుల నంబర్లు ముందుగా సేకరించి పెట్టుకోవడంతో వారితో మాట్లాడి సదరు నిర్మాణదారుడి ఇంటి వద్దకు డస్టు, కంకర, ఇసుక వంటివి పంపాలని ఫోన్‌పే, గుగూల్‌పే ద్వారా డబ్బు పంపుతామని నమ్మిస్తున్నారు. సాధారణంగా అందరూ మెటీరియల్ తెప్పించుకున్న తరువాతే డబ్బులు ఇస్తారు. దీంతో వారుకూడా అదే మాదిరిగానే అనుకుని డ్రైవర్ ద్వారా వారు చెప్పిన చోటుకు మెటీరియల్ పంపించి ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత డబ్బు గురించి ఫోన్లో సంప్రదించే సమయానికి ఆన్‌లైన్ వ్యాపారం చేసే షాపుల నిర్వాహకుల ఖాతాకు డబ్బు తెప్పించుకుని వారి వద్ద నుంచి కమీషన్ పోనూ మిగతా నగదు తీసుకుని ఉడాయిస్తున్నారు. లారీ యజమానులు నగదు కోసం ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుంది. దీంతో లారీ యజమానులు ఇంటి నిర్మాణదారుల వద్దకు వెళ్లి డబ్బుల గురించి గొడవకు దిగుతున్నారు. మాకు మెటీరియల్ పంపించిన వ్యక్తి చెప్పినట్లుగానే ఆన్‌లైన్‌లో నగదు చెల్లించినట్లు వారు చెబుతున్నారు. దీంతో లారి యజమానులు చేసేదేమి లేక వారు మోసపోయినట్లు గుర్తించి పోలీసులను సంప్రదిస్తున్నారు. ఇటీవల ఇలాంటి సంఘటనలు కందుకూరు మండలంలో చోటుచేసుకున్నాయి. లారీల నిర్వాహకులు తమకు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మెటీరియల్ కావాలని చెబితే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. పూర్తి నమ్మకం కలిగిన తర్వాతనే లోడ్ పంపించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇలాంటి విషయంలో మోసాలను గుర్తించే విధంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రణాళికతో పారిశుద్ధ్య నిర్వహణ



కమిషనర్ వసంత

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జల్‌పల్లి కమిషనర్ వసంత తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టి లో ఉంచుకొని మున్సిపాలిటీ లోని 28 వార్డుల్లో విష జ్వరాలు ప్రబలకుండా ప్రణాళికబద్ధంగా చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామన్నారు. 100 కాలనీల్లోని చెత్తను సరిపడ వాహనాల్లో తరలిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణపై మరిన్ని విషయాలను మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: పెద్ద ఎత్తున మురికివాడలు కలిగిన మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ఎన్ని వాహనాలను వినియోగిస్తున్నారు?

జవాబు: ఇక్కడ 1.20 లక్షల జనాభా ఉంది. మొత్తం 18 వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం. 12 ఆటోలు, ఒక జేసీబీ, గల్పర్, నాలుగు ట్రాక్టర్లతో చెత్తను ఎత్తిస్తున్నాం. 91 మంది కార్మికులతో వీధులను శుభ్రం చేయిస్తున్నాం. ఉదయం 5 గంటల నుంచి పారిశుద్ధ్యంపై డ్రైవ్ ప్రారంభమవుతుంది.

ప్రశ్న: చెత్తను ఎక్కడికి తరలిస్తారు?

జవాబు: కొన్ని వార్డుల్లో సేకరించిన చెత్తను ప్రైవేట్ ఆటోలు జీహెచ్ఎంసీకి తరలిస్తున్నాయి. మిగిలిన వార్డుల్లోని చెత్తను మొదటగా బీజాన్ గుట్టపై పోగుజేసి, ఆపై బయోమైనింగ్ ద్వారా జీవ ఎరువుగా మారుస్తున్నాం.

ప్రశ్న: విష జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డెంగ్యూ, మలేరియా లాంటివి సోకకుండా ప్రతి వార్డులో ఫాగింగ్ చేస్తున్నారు. చెత్త పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం.

ప్రశ్న: పారిశుద్ధ్య నిర్వహణకు ఏడాదికి ఎంత ఖర్చు చేస్తున్నారు?

జవాబు: ఏడాదికి దాదాపు రూ.1 కోటి వరకు ఖర్చు చేస్తున్నాం. విస్తీర్ణం ఎక్కువగా ఉన్న దృష్ట్యా రెండు స్వీపింగ్ మిషన్లు కొనుగోలు చేయాలని నిర్ణయించాం.

ప్రశ్న: ఓపెన్ నాలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? పూడిక తీత పనులు చేపడుతున్నారా ?

జవాబు: పహాడీషరీఫ్, శ్రీరాం కాలనీ, కొత్తపేటలో ఓపెన్ నాలాలున్నాయి. నబీల్ కాలనీలో ఇటీవలే డ్రెయిన్ బాక్స్‌ల నిర్మాణం కొనసాగుతోంది. ఎర్రకుంటలో ఓపెన్ నాలాలపై పైకప్పులు నిర్మించం. మిగిలిన ఓపెన్ నాలాలో నిండిన వ్యర్థాలను తొలగిస్తున్నాం.

సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు



మాట్లాడుతున్న మేయర్ పారిజాత

- బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత
- వీధి విక్రయదారులకు అవగాహన

బడంగ్‌పేట్: సిబిల్ స్కోర్ ఆధారంగా తిరిగి రుణాలు మంజూరు చేస్తారని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, భారత్ ఆత్మ నిర్బర్ పథకం ద్వారా వీధి విక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ హాజరై మాట్లాడుతూ చిరు వ్యాపారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించిన వారికి సిబిల్ స్కోర్ ఆధారంగా తిరిగి రుణాలు మంజూరు చేస్తారన్నారు. బ్యాంకు మేనేజర్లు చెప్పిన విషయాలను సామాన్య ప్రజలకు తెలియజేయాలని ఆర్పీలను కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌సింగ్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్‌రావు, శ్రీనిధి, ఆర్ఎం ఉదయ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

కందుకూరు: సర్వేయర్ అసిస్టెంట్స్‌గా తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న చైన్‌మెన్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కె.నర్సింహ, జి.రమేశ్, శ్రీనివాస్‌చారి, గణపతి తదితరులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సర్వేయర్ల దగ్గర అసిస్టెంట్లుగా పని చేస్తున్నామని, వీఆర్ఏల మాదిరి తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించేలా చొరవ చూపాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు చిర్ర సాయిలు, గండు నర్సింహా, చిర్ర ప్రసాద్, విఘ్నేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: మంత్రికి వినతిపత్రం అందిస్తున్న చైన్‌మెన్‌లు



మహేశ్వరం: సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

అక్షయ పాత్ర వెనక్కి తీసుకోవాలని..

మహేశ్వరం: అక్షయపాత్ర ఇస్తున్న నాలుగు మండలాలను వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి, మొయినాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్ మండలాలు మధ్యాహ్న భోజనాన్ని అక్షయపాత్ర ఇవ్వకూడదని పెండింగ్‌లో ఉన్న 9 నెలల బిల్లులను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పెంచిన రూ.3వేలు వేతనం, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి సబితాఇంద్రారెడ్డి కార్మికులకు హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర డైరెక్టర్ దేవసేన, డీఈఓలకు మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అక్షయ పాత్ర ఇవ్వొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం కార్యదర్శి స్వప్న, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లేష్, శేఖర్, శ్రీశైలం, గణేష్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతమే లక్ష్యం



వైద్య సిబ్బందితో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

కందుకూరు: ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కందుకూరు పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా వైద్యులు, సిబ్బందికి ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక, వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ హరినాథ్, సర్పంచులు శ్రీనివాస్‌చారి, శమంతకమణి, కందుకూరు, రాచులూరు, లేమూరు పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు సూర్యగిరి ఎల్లమ్మ



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు ఇలవేల్పుగా మారింది. అధిక శ్రావణ మాసం, అమ్మవారికి ఇష్టమైన రోజని, మంగళవారం ఉదయం నుంచే ఆలయంలో భక్తులు క్యూ కట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. బోనాలతో నైవేద్యం సమర్పించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యానారాయణ వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తరిస్తాం

మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న చెన్నకిషన్‌రెడ్డి

కందుకూరు: లయన్స్‌క్లబ్ సేవలను మరింతగా విస్తరింపజేయాలని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కందుకూరు నూతన అధ్యక్షుడిగా నియమితులైన నిమ్మ అంజిరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం రాత్రి టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయనిజం అంటే సేవా కార్యక్రమాలకు నిలయమన్నారు. ప్రతీ ఒక్కరు లయన్స్‌క్లబ్ సభ్యుడిగా చేరి సేవల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, లయన్ శేఖర్‌రెడ్డి, తాళ్ల అంజయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఎగ్గిడి సత్తయ్య, బైరు కొండల్‌రెడ్డి, బీఆర్ రాంరెడ్డి, వెంకటేష్‌గుప్తా, రామన్ బాబు, దీపారెడ్డి, సుధారాణి, రమాకాంత్‌రెడ్డి, దేశం సత్తిరెడ్డి పాల్గొన్నారు.

యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుదల

విజయ్ ప్రతాప్ మహరాజ్



యోగా చేస్తున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: యోగాతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని గురుజీ విజయ్ ప్రతాప్ మహరాజ్ అన్నారు. మంగళవారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం రెసిడెన్షియల్ స్కూల్లో సమగ్ర వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణలో భాగంగా సుమారు 500 మంది విద్యార్థినులు ఆసనాలు, ప్రాణాయామాలు, ముద్రలు, సంగీతంతో సమన్వయం చేయబడిన ఆనందతాండవం, ధ్యాన శిక్షణ చేశారు. విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలంటే ప్రతీ రోజు అరగంట యోగాసనాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు తిరునగిరి నర్సింహ, ప్రిన్సిపాల్ ప్రభుదాస్, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, వైస్ ప్రిన్సిపాల్‌లు మాధురి, స్వప్న, ఉపాధ్యాయులు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సురేందర్ పాల్గొన్నారు.

ముర్రుపాలతో ఆరోగ్యం

కార్పొరేటర్ ఇంద్రసేనా



తల్లిపాల వారోత్సవంలో కార్పొరేటర్ ఇంద్రసేనా

బడంగ్‌పేట్: పుట్టిన పిల్లలకు ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారని కార్పొరేటర్ ఇంద్రసేనా అన్నారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ అంగన్‌వాడీ కేంద్రంలో అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలను పట్టించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను తాగించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడీ టీచర్లు కె.సునీత, కవి, కల్పన, మాణిక్యమ్మ, మంజుల, ఆయాలు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడడం బాధాకరం



మాట్లాడుతున్న గ్రీన్‌జోన్ బాధితులు

బడంగ్‌పేట్: గ్రీన్ జోన్ ఎత్తి వేయకుండా బీఆర్ఎస్ నాయకులు బాధితులను బెదిరించడం బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నేత నవారు మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గ్రీన్‌జోన్ బాధితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 121, 122, 123, 126, 127, 128, 129, 130లో సర్వే నెంబర్లలో 1984 నుంచి 1991లో లే అవుట్‌లు చేయగా న్యూ తిరుమలనగర్, మల్‌రెడ్డి రంగారెడ్డి నగర్, శ్రీహిల్స్, శ్రీ సాయిహోమ్స్, వేంకటేశ్వర కాలనీ, ఏఆర్‌సీఆర్ కాలనీ, విశాఖనగర్ తదితర కాలనీలు ఏర్పడ్డాయన్నారు. 2008లో హెచ్ఎండీఏ ఏర్పాటు తర్వాతా అనాలోచితంగా ప్రైవేట్ భూములను గ్రీన్ జోన్ కింద మార్చేశారన్నారు. అప్పటినుంచి గ్రీన్ జోన్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు, ఇళ్ల నిర్మాణదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మునిసిపాలిటీనుంచి అనుమతులు ఇవ్వకుండా, ఇంటి నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తూ అధికారులు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ జోన్ వల్ల ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులతో పాటు ప్రభుత్వ ఖజానాకు రూ. కోట్లల్లో నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక మంత్రి సబితారెడ్డి బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రీన్ జోన్ ఎత్తివేయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రామేశ్వర్‌రావు, రాఘవేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో అమరేందర్ రెడ్డి

పహాడీషరీఫ్: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం చేకూరుతుందని టీపీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌సీఐ రోడ్డులోని ఏబీఆర్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో రేవంత్ రెడ్డి టి-10 క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై టాస్‌వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగులతో కూడిన దైనందిన జీవితంలో శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రికెట్‌లో రాణించిన వారికి ఎంతో భవిష్యత్ ఉంటుందన్నారు. నిర్వాహకులు అశ్ఫాక్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ తౌఫిక్, హమీద్, మహ్మద్ రియాజ్, అహ్మద్ బామ్ తదితరులు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధిని గమనించకుండా బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్ చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్ధన్‌లు హితవు పలికారు. జల్‌పల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఎత్తు ప్రాంతాల్లో సైతం నీరు నిలిచిందన్నారు. ఒక వార్డులో తిరిగి ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీటిని భూతద్దంలో చూపించడం బాధాకరమన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, నాయకులు నగేష్, మారుతీ, సత్తిరెడ్డి, సయీద్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలానికి నూతన తహసీల్దార్‌గా విచ్చేసిన మాధవిరెడ్డిని మంగళవారం మండల రేషన్ డీలర్లు బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రేషన్ డీలర్ల సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ప్రతి నెలా సరైన సమయానికి రేషన్ కార్డు దారులకు సరుకులను పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి, డీలర్లు దండు గణేష్, రమేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, సురేష్‌గుప్తా, హర్షవర్ధన్, రాజుయాదవ్, వనిత, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దారంతా.. గుంతలమయం

మండల పరిధిలో కందుకూరు నుంచి మహ్మద్‌నగర్ మీదుగా దెబ్బడగూడ గ్రామానికి వెళ్లే రహదారి సుమారు అర కిలోమీటర్ మేర గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కందుకూరు



దెబ్బడగూడ సమీపంలోని రోడ్డు దుస్థితి